సాక్షి పార్వతీపురం మన్యం

బుధవారం । 31 । జూలై । 2024



ఎదురుచూపు ఇంకెన్నాళ్లు..!
దశాబ్దాలుగా ప్రభుత్వాలు మారుతున్నాయి. పాలకులూ మారుతున్నారు. కానీ బొబ్బిలి నియోజకవర్గంలోని తమ గ్రామాల బతుకులు మారడం లేదని గిరిజనులు వాపోతున్నారు. - 8లో



ఏడుగురు గంజాయి నిందితుల అరెస్ట్
గంజాయి అక్రమ రవాణాచేస్తున్న ఏడుగురు నిందితులను అరెస్టు చేయడంతో పాటు వారికి సహకరిస్తున్న ఒక జువైనల్‌ను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. - 8లో

నేడు వీఆర్ఎస్ సాగు నీరు విడుదల
మక్కువ: మండలంలోని శంబర గ్రామ సమీపంలో ఉన్న వెంగళరాయ సాగర్ ప్రాజెక్టు ద్వారా కాలువలకు బుధవారం సాగునీరు విడుదల చేయనున్నట్లు ఇరిగేషన్ జేఈ శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు గిరిజన శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి, బొబ్బిలి ఎమ్మెల్యే ఆర్‌వీఎస్‌కే రంగారావులు సాగునీరు విడుదల చేయనున్నారన్నారు. కార్యక్రమంలో పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయ చంద్రతో పాటు జలవనరుల శాఖ అధికారులు పాల్గొననున్నట్లు జేఈ తెలియజేశారు.

న్యూస్‌రీల్

నాబార్డు కార్యాలయం ప్రారంభం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

పార్వతీపురం టౌన్: పార్వతీపురంలోని ఎస్ఎపీ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన నాబార్డు కార్యాలయాన్ని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ మంగళవారం ప్రారంభించారు. రాష్ట్రంలోని ఆశావహ జిల్లాలైన పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు నాబార్డ్ కొత్త కార్యాలయాలను మంజూరు చేసింది. పార్వతీపురంలో కార్యాలయాన్ని ప్రారంభించేందుకు నాబార్డు అధికారులు వెంటనే చర్యలు చేపట్టారు. డీఎస్ దినేష్ కుమార్ రెడ్డిని నాబార్డ్ జిల్లా అభివృద్ధి అధికారిగా నియమించారు. ఈ సందర్భంగా కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ మాట్లాడుతూ జిల్లాకు బ్యాంకులు మంచి సహకారం అందించాలని పిలుపునిచ్చారు. నీతి ఆయోగ్ పార్వతీపురం మన్యం జిల్లాను ఆశావహ జిల్లాగా గుర్తించిందని, బ్యాంకర్ల మద్దతుతో సాధ్యమైన అన్ని రంగాలలో అభివృద్ధి సాధించవచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు. జిల్లా అన్ని రంగాల్లో రాణించి మిగతా జిల్లాలకు ఆదర్శంగా నిలవాలని, ఇందుకు నాబార్డ్ కీలక పాత్ర పోషించాలని కోరారు. కార్యక్రమంలో నాబార్డు ఏపీ రీజియన్ సీజీఎం ఆర్.గోపాల్, శ్రీకాకుళం డీసీసీబీ సీఈఓ వరప్రసాద్, ఏపీజీవీబీ ఆర్ఎం అర్జున రావు తదితరులు పాల్గొన్నారు.

ఏనుగుల సంచారంతో ఆందోళన



పెదకుదమ-చినకుదమ గ్రామాల మధ్య ఏనుగులు

జియ్యమ్మవలస: మండలంలోని పెదకుదమ-చినకుదమ గ్రామాల మధ్య ఏనుగులు సంచరిస్తున్నాయి. మంగళవారం మధ్యాహ్నం సింగనాపురం గ్రామం నుంచి తరలివచ్చిన ఏనుగులు పెదకుదమ,చినకుదమ గ్రామాల మధ్య పంట పొలాలలో సంచరించడంతో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. అరటి పంట పక్వదశలో ఉందని ఏనుగులు ధ్వంసం చేస్తే నష్టపోవాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు. చెరకు, పామాయిల్, వరి పంటలు ఉండడంతో అక్కడి నుంచి ఏనుగులు కదలడం లేదని, రాత్రి సమయాన గ్రామాల్లోకి చొచ్చుకువచ్చే ప్రమాదం ఉందని గ్రామస్తులు, రైతులు అంటున్నారు. అటవీశాఖాధికారులు వాటిని తరలించే ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు.

ఆగస్టు 2న రావికోనలో మెగా వైద్యశిబిరం

పార్వతీపురంటౌన్: పార్వతీపురం మండలంలోని రావికోనలో ఆగస్టు 2న మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డాక్టర్ విజయపార్వతి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. పెదబొండపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గల గిరిజన గ్రామమైన రావికోనలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వైద్యారోగ్య శాఖ మండల న్యాయ సేవా కమిటీ, ఐటీడీఏ, ఎన్‌జీఓ, ఐఆర్‌పీ డబ్ల్యూ, లయన్స్ క్లబ్ సంయుక్తంగా వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పరిసర గ్రామాల ప్రజలు వైద్యసేవలు వినియోగించుకోవాలని కోరారు. గ్రామ ప్రజలతో పాటు విద్యార్థులు కూడా హాజరై వైద్యసేవలు పొందాలని పిలుపునిచ్చారు.

ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు నోటిఫికేషన్

పార్వతీపురంటౌన్: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించి పదవ తరగతి, ఇంటర్మీడియట్‌లలో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేసిందని జిల్లా విద్యాశాఖధికారి జి.పగడాలమ్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదవ తరగతిలో ప్రవేశానికి 14 సంవత్సరాల వయస్సు నిండి ఉండాలన్నారు.
ఇంటర్మీడియట్ కోసం పదవ తరగతి ఉత్తీర్ణత సాధించి 15సంవత్సరాలు నిండిన అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. దరఖాస్తులను జూలై 31 నుంచి ఆగస్టు 28 లోగా డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీ ఓపెన్‌స్కూల్.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్ లో నమోదు చేసుకుని, రుసుము చెల్లించాలని తెలిపారు. రూ.200 ఆలస్య రుసుముతో సెప్టెంబర్ 4లోగా ఫీజు చెల్లించి నమోదు చేసుకోవాలని, పూర్తి వివరాలకు జిల్లా విద్యాశాఖ కార్యాలయం పని వేళల్లో సంప్రదించాలని సూచించారు.

రైలు ప్రయాణం కష్టమైపోతోంది



రోజూ ఉద్యోగరీత్యా విధులకు వెళ్లిరావడానికి ఒకప్పుడు రైలు ఎంతో సౌకర్యంగా ఉండేది. ఇప్పుడు రానురాను ఎంతో కష్టమైపోతోంది. ఎక్స్‌ప్రెస్ రైళ్లలో దాదాపు అన్నీ ఏసీ బోగీలే దర్శనమిస్తున్నాయి. జనరల్ బోగీలో అడుగుపెట్టడానికే సాహసించలేం. స్లీపర్ కోచ్‌లు మూడే ఉంటున్నాయి. అవీ కిక్కిరిసిపోతున్నాయి. గంటల తరబడి నిల్చొనే ప్రయాణం చేస్తున్నాం.
-పార్వతి, ప్రయాణికురాలు

రైల్వేశాఖకే అవమానం



చాలామంది ప్రయాణికులు, చివరకు పిల్లలతో ఉన్నవాళ్లు కూడా చేసేదిలేక జనరల్ బోగీలో ప్రయాణాలు చేస్తున్నారు. అవెప్పుడూ కిటకిటలాడుతున్నాయి. చివరకు బాత్రూమ్‌ల వద్ద కూడా కూర్చొండిపోతున్నారు. ఇది రైల్వేశాఖకే అవమానమన్నది గుర్తుపెట్టుకోవాలి. అందరికీ అనువుగా జనరల్ బోగీలు, స్లీపర్ కోచ్‌లు సంఖ్య పెంచితేనే సమస్య పరిష్కారమవుతుంది.
- ఎ.బాలకృష్ణ, ప్రయాణికుడు



విశాఖ ఎక్స్‌ప్రెస్ జనరల్ బోగీలో కిక్కిరిసిన ప్రయాణం

చుక్‌చుక్ బండి.. ఎక్కలేమండీ!

- జనరల్ బోగీల్లో విలవిల్లాడిపోతున్న సాధారణ ప్రయాణికులు
- మూడే స్లీపర్ కోచ్‌లతో ఎంఎస్‌టీల పరిస్థితి ఆగమ్యగోచరం
- ప్రధాన రైళ్లన్నింటిలోనూ విపరీతమైన రద్దీ
- రిజర్వేషన్‌తో వెళ్దామంటే చాంతాడంత వెయిటింగ్ లిస్ట్
- సామాన్యులకు ప్రయాణం ప్రత్యక్ష నరకం
- జనరల్ భోగీలు తగ్గించేసి చుక్కలు చూపిస్తున్న రైల్వేశాఖ
- బాత్రూమ్‌ల దగ్గర కూడా కూర్చొని ప్రయాణించాల్సిన పరిస్థితి
- అన్నివిధాలా అనుకూలమనుకున్న విశాఖ ఎక్స్‌ప్రెస్‌లోనూ అదే దుస్థితి

విజయనగరం మీదుగాప్రతిరోజూ రాకపోకలు సాగించేవి ఎక్స్‌ప్రెస్‌లు 17	వారానికి ఒకసారి, రెండుసార్లు, మూడుసార్లు తిరిగే రైళ్లు 67 (స్పెషల్ ట్రైన్లు అదనం)	విజయనగరం స్టేషన్ నుంచి ప్రతిరోజు ప్రయాణించేవారి సంఖ్య సుమారు 5వేలు
పాసింజర్లు 7		

సాక్షి ప్రతినిధి, విజయనగరం/విజయనగరం టౌన్: రైలు ప్రయాణం అంటేనే ఒకప్పుడు సామాన్యులకు ప్రధాన ప్రయాణ సాధనంగా ఉండేది. విజయనగరం జిల్లా నుంచి ఇతర ప్రాంతాలకు పని కోసం వెళ్లొచ్చేవారికి ఓ వరమే. కానీ ప్రస్తుత కాలంలో అదొక ప్రత్యక్ష నరకంగా మారింది. ఎక్స్‌ప్రెస్ రైళ్లల్లో ఒక్కోదానికి 20కి పైగా బోగీలుంటే వాటిలో కనీసం నాలుగైనా జనరల్ బోగీలు ఉండేవి. అవిగాక మహిళలకు, దివ్యాంగులకు ప్రత్యేకంగా మరో రెండు బోగీలు ఏర్పాటుచేసేవారు. ఆయా రైళ్లలో చిరువ్యాపారులు, సామాన్యులు, ఉద్యోగులు ఎంతో సుఖవంతంగా తమ గమ్యస్థానాలకు చేరుకునేవారు. కానీ ఇప్పుడు ఎక్స్‌ప్రెస్ రైళ్లలో జనరల్ బోగీలు రెండే. ఇంజన్‌కి వెనుక ఒకటి, చివరల్లో గార్డ్‌కు ముందు మరొకటి. దొరికిన బోగీలోకే ఎక్కి ఆ రద్దీలో బాత్రూమ్‌ల వద్దనైనా ముక్కుమూసుకుని కూర్చొని ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది.



మహిళల బోగీలో పురుషులు

• సామాన్యులకు ఆలవాలం

విజయనగరం రైల్వేస్టేషన్ ఒడిశా రాష్ట్రానికి (మెయిన్ లైన్), ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి (రాయగడ, కిరండోల్ ఆర్‌వీ లైన్) వెళ్లే రైళ్లకు ప్రధాన జంక్షన్‌గా నిలుస్తోంది. ఆర్‌వీ లైన్ నుంచి వచ్చే రైళ్లలో ప్రధానంగా బొకారో ఎక్స్‌ప్రెస్, హటియా యశ్వంత్‌పూర్, టాటా బెంగళూరు, హటియా ఎర్నాకులం, టాటా ఎర్నాకులం, భువనేశ్వర్ జగదల్‌పూర్ హీరాఖండ్ ఎక్స్‌ప్రెస్, భువనేశ్వర్ జునాగఢ్ రోడ్ ఎక్స్‌ప్రెస్‌లు ప్రధానంగా నడుస్తున్నాయి. వీటితో పాటు మెయిన్ లైన్‌కి సంబంధించి హౌరా-చెన్నై ఎక్స్‌ప్రెస్, విశాఖ ఎక్స్‌ప్రెస్, ఫలక్‌నుమా, ఈస్ట్‌కోస్ట్ వంటి రైళ్లు ఉన్నాయి. అయితే ప్రధాన జంక్షన్‌లతో పాటు ముఖ్యమైన స్టేషన్‌లలో కూడా ఆగేటటువంటి విశాఖ ఎక్స్‌ప్రెస్‌ను ఎక్కువమంది ఉద్యోగులు, వ్యాపారులు, మహిళలు ఆశ్రయిస్తుంటారు. విజయనగరం మీదుగా ప్రతిరోజూ రాకపోకలు సాగించేవి 17 ఎక్స్‌ప్రెస్ రైళ్లు, ఏడు ప్యాసింజర్లు ఏడు ఉన్నాయి. వారానికి ఒకసారి, రెండుసార్లు, మూడుసార్లు తిరిగే రైళ్లు 67 వరకూ ఉన్నాయి. వీటికి స్పెషల్ ట్రైన్లు అదనం. ఈ రైళ్ల ద్వారా విజయనగరం స్టేషన్ నుంచి దాదాపు ఐదు వేల మందికి పైగా ప్రతిరోజూ ప్రయాణిస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నాటి విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ తదితర నాయకుల కృషితో ప్రధానమైన ఎక్స్‌ప్రెస్ రైళ్లలో చాలావాటికి విజయనగరం స్టేషన్‌లో హాల్ట్ వచ్చేలా చేశారు. కానీ ఇప్పుడు సామాన్యుడు ప్రయాణించే జనరల్ బోగీలను రైల్వే శాఖ కుదించేసి ఏసీ బోగీలను పెంచింది. దీంతో సామాన్య ప్రయాణికులతో పాటు ఉద్యోగాలు, ఉపాధి కోసం అటు విశాఖపట్నం, ఇటు పార్వతీపురం, మరోవైపు ఇచ్ఛాపురం వరకూ ప్రతిరోజూ రాకపోకలు సాగించేవారంతా ఇబ్బంది పడుతున్నారు.



బోగీ నిండిపోవడంతో పుట్‌బోర్డుపైనే ప్రమాదకర ప్రయాణం చేస్తున్న యువకులు

• రైల్వే శాఖ నిర్ణయాలతో ఇబ్బందులు...

ఎక్స్‌ప్రెస్ రైళ్లకు జనరల్ బోగీ ముందొకటి, ఆఖర్లో ఒకటి పెడుతుండటంతో ఏదో ఒకచోట మాత్రమే సాధారణ ప్రయాణికులు వేచిఉండాల్సిందే. తీరా రైలు వచ్చాక ఆ బోగీలోనే ఎక్కాలి. రద్దీగా ఉందని చివరనున్న మరో జనరల్ బోగీ కోసం వెళ్లాలంటే అప్పటికే రైలు కదిలిపోతోంది. దీంతో నిబంధనలకు విరుద్ధమైనా సరే కొంతమంది పురుషులు మహిళా బోగీలోనూ ఎక్కిపోతున్నారు. లేదని స్లీపర్ క్లాస్‌లోకి వెళ్తే రెట్టింపు జరిమానా రైల్వే శాఖ విధిస్తోంది. సామాన్యులు ప్రయాణించే రైళ్లపై ఎలా చిన్నచూపు చూస్తుందో చెప్పాలంటే రాయగడ-గుంటూరు డైలీ ఎక్స్‌ప్రెస్ మరో నిదర్శనం. ఉమ్మడి విజయనగరం జిల్లా నుంచి వేరుచేసి పార్వతీపురం మన్యం జిల్లా ఏర్పాటైన తర్వాత ఈ రైలుకు మరింత డిమాండు పెరిగింది. ఆ జిల్లాకు బదిలీ అయిన ఉద్యోగులతో పాటు అక్కడ పనిచేస్తున్న చాలామంది ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల సిబ్బంది, ఉపాధ్యాయులు, సచివాలయాల ఉద్యోగులు దీనిలోనే పార్వతీపురం వరకూ ప్రయాణిస్తుంటారు. అయినా సరే రైల్వేశాఖ దీన్ని తరచుగా రద్దు చేసేస్తుంటుంది. ఇప్పుడు ఆగస్టు 10వ తేదీ వరకూ నిలిపేసింది.



విశాఖ ఎక్స్‌ప్రెస్‌లో బాత్‌రూం వద్దే కూర్చొని ప్రయాణిస్తున్న ఓ కుటుంబం

ఈ కష్టాలు చూడతరమా?

అమృత్‌భారత్ పేరుతో రైల్వేస్టేషన్‌లను అభివృద్ధి చేస్తామన్న దేశ ప్రధాని నరేంద్ర మోదీ హామీ మాటెలా ఉన్నా జనరల్ బోగీల్లో సామాన్య ప్రయాణికుల కష్టాలు మాత్రం వర్ణనాతీతం. వారూ టికెట్ తీసుకొనే ప్రయాణిస్తున్నా రైల్వే శాఖ దృష్టికి వారు కనిపించట్లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మంగళవారం మధ్యాహ్నం 2:50 గంటల సమయంలో భువనేశ్వర్-సికింద్రాబాద్ విశాఖ ఎక్స్‌ప్రెస్ (నంబరు 17015) విజయనగరం రైల్వే స్టేషన్‌కు చేరుకుంది. దీనిలో జనరల్ బోగీల్లో పరిస్థితిపై 'సాక్షి' బృందం పరిశీలించింది. 21 బోగీలున్న ఈ రైల్లో జనరల్ బోగీలు కేవలం రెండే. స్లీపర్ క్లాస్ బోగీలు గతంలో 12 వరకూ ఉండేవి. ఇప్పుడు మూడే కనిపిస్తున్నాయి. ఒక పవర్ సప్లయ్ కార్, దివ్యాంగుల బోగీ, మహిళలకు ప్రత్యేక బోగీ తప్పితే మిగతా 13 బోగీలూ ఏసీవే. ఈ రైలులో విజయనగరం నుంచి సికింద్రాబాద్‌కు ప్రయాణించాలంటే రూ.160 రుసుం అవుతుంది. స్లీపర్ క్లాస్ టికెట్ అయితే రిజర్వేషన్‌తో కలిపి రూ.400 అవుతుంది. సామాన్యులకు ఇవే కాస్త అందుబాటులో ఉంటాయి. అత్యవసర ప్రయాణమైనప్పుడు రూ.1090 భరించి థర్డ్ ఏసీ టికెట్ తీసుకుందామన్నా బెర్త్‌లు దొరకట్లేదు. అలాంటి పరిస్థితుల్లో జనరల్ బోగీలు మరింత కిక్కిరిసిపోతున్నాయి. ప్రధాన జంక్షన్‌ల మీదుగా వచ్చే విశాఖ ఎక్స్‌ప్రెస్ ఒక్కటే కాదు ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్, ఫలక్‌నుమా, బొకారో ఎక్స్‌ప్రెస్ వంటివాటికి వెయిటింగ్ లిస్టే దర్శనమిస్తుంది. ఫలితం ప్రయాణికులకు కష్టాలు తప్పడంలేదు.



రైలు పేరు: విశాఖ ఎక్స్‌ప్రెస్



రూట్
భువనేశ్వర్-సికింద్రాబాద్

	గతం	ప్రస్తుతం
బోగీల సంఖ్య	20	21
జనరల్ బోగీలు	4	2
స్లీపర్ బోగీలు	12	3
ఏసీ బోగీలు	5	13

(ఒక పవర్ సప్లయ్ కార్, దివ్యాంగుల బోగీ, మహిళలకు ప్రత్యేక బోగీ)

ఏసీ బోగీలో ప్రయాణం అందరికీ సాధ్యమా?



రైలు ప్రయాణమంటే ఏసీ బోగీలే అన్నట్టు ఉంది ప్రస్తుత రైల్వేశాఖ తీరు. జనరల్ బోగీలు ముందుకొకటి, వెనక్కొకటి తగిలించేశారు. ఆ చివరకి వెళ్తే అక్కడ ఖాళీగానే లేకపోతే అంతే మరి. ఈ చివరికి రాలేని పరిస్థితి. స్లీపర్ క్లాస్ రిజర్వేషన్ ఎప్పుడూ వెయిటింగ్ లిస్టులే. ఏసీ బోగీలో ప్రయాణం అంటే అందరికీ అవుతుందా?
- జె.ఉత్తమ్, ప్రయాణికుడు

ప్రత్యక్ష నరకం...



జనరల్ బోగీలో ఎక్కాలంటే నరకం కనపడుతుంది. వేరే గత్యంతరం లేక ఎక్కాల్సి వస్తోంది. ఇప్పటికి గంటన్నర పాటు జర్నీ చేశాను. పూర్తిగా తడిసిముద్దయ్యాను. జనరల్ బోగీ కిక్కిరిసిపోయింది. అధికారులు స్పందించి జనరల్ బోగీల సంఖ్యను పెంచాలి.
- జి.పోలినాయుడు, ప్రయాణికుడు

రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం

- టీడీపీ నేతలు హామిలిస్తారే తప్ప అమలుచేయరు
- తల్లికి వందనం, రైతుకు పెట్టుబడి నిధులు ఇచ్చేసమయం రాలేదా?
- బాబు సృష్టించిన సంపద ఎక్కడ ?
- జాబ్ క్యాలెండర్ ఏదీ?
- సూపర్ సిక్స్ పథకాలు ఎప్పుడు అమలు చేస్తారు ?
- మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

సాలూరు: రాష్ట్రంలో అంబేడ్కర్ రాజ్యాంగం కాదని నారా లోకేశ్ రాసిన రెడ్‌బుక్ రాజ్యాంగం అమలవుతోందని మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర విమర్శించారు. సాలూరు పట్టణంలోని తన స్వగృహంలో మీడియాతో మంగళవారం మాట్లాడారు. కూటమి ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రతిపక్షాలు, ప్రజలు నిలదీస్తారనే భయంతో రెడ్‌బుక్ రాజ్యాంగంతో అరాచక పాలన సాగిస్తున్నారని మండిపడ్డారు. నేడు రాష్ట్రంలో ప్రజల ధన, మాన, ప్రాణాలకు రక్షణ లేదని, గిరిజన బాలికలపై అత్యాచారాలు జరుగుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారని వాపోయారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సగటున ఏటా 43 లక్షల మంది తల్లుల బ్యాంకు ఖాతాలకు అమ్మఒడి పథకం కింద బడులు తెరిచిన వెంటనే సుమారు రూ.26,067 కోట్ల నిధులు జమచేసిందన్నారు. నేడు పాఠశాలలు తెరిచి రెండునెలలవుతున్నా పథకం పేరు మార్చారే తప్ప రూపాయి నిధులు విదల్చలేదన్నారు. వైఎస్సార్ రైతు భరోసా కింద రాష్ట్రంలోని 53 లక్షల మంది రైతులకు పెట్టుబడి సాయంగా రూ.34,378.16 కోట్లను గత ప్రభుత్వం ఇచ్చిందన్నారు. ఖరీఫ్ పనులు సాగుతున్నా పెట్టుబడి సాయం ఊసే కూటమిప్రభుత్వానికి లేకపోవడం విచారకరమన్నారు.

సూపర్ ఫ్లాప్ పథకాలు చేస్తారేమో..
కూటమి నాయకులు గొప్పగా ప్రచారం చేసిన సూపర్ సిక్స్ పథకాలను సూపర్ ఫ్లాప్ చేసేలా ఉందని రాజన్నదొర ఆరోపించారు. అసెంబ్లీలో కనీసం బడ్జెట్‌ను ప్రవేశపెట్టక పోవడం దారుణమన్నారు. టీడీపీ 100 కోట్లు ఖజానా అప్పజెప్పినప్పుడు 2019లో అధికారంలోకి వచ్చిన జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టిందని గుర్తుచేశారు. నేడు రూ.7వేల నుంచి రూ.8 వేల కోట్లు ఖజానాలో ఉన్నా ఉద్దేశపూర్వకంగానే బడ్జెట్ పెట్టడంలేదని ఆరోపించారు. ఎస్‌బీఐ నివేదిక ప్రకారం ఏపీకి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 2022లో జీఎస్‌డీపీలో 4.5 మేరకు అప్పు చేయడానికి అనుమతి ఉండగా, 1.04తక్కువగా 3.1 శాతం మాత్రమే నికర అప్పును నాడు వైఎస్సార్‌సీపీ చేసిందన్నారు. 2023లో జీఎస్‌డీపీలో 4 శాతం అప్పు చేయడానికి ప్రపంచ బ్యాంకు అనుమతి ఇవ్వగా 0.5తక్కువగా 3.5 శాతం మాత్రమే నికర అప్పు చేసిందని వెల్లడించారు. కేంద్ర ఆర్థిక శాఖమంత్రి నిర్మలా సీతారామన్ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.5లక్షల కోట్ల లోపు అప్పు చేసిందని వెల్లడించారని గుర్తుచేశారు.

జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలి
టీడీపీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు 50 వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీ ఉన్నాయంటూ ఆ పార్టీ నాయకులు, వారి అనుకూల మీడియా ప్రచారం చేశారని, ఇప్పుడు కేవలం 16వేల పోస్టులతో మెగా డీఎస్సీ అంటూ ప్రగల్భాలు పలకడం విచారకరమని రాజన్నదొర అన్నారు. డీఎస్సీ నోటిఫికేషన్ కూడా ఇప్పట్లో ఇచ్చే సూచనలు కనిపించడం లేదన్నారు. ఎన్నికల హామీగా ఇచ్చిన జాబ్‌క్యాలెండర్‌ను తక్షణమే విడుదల చేయాలన్న నిరుద్యోగుల డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. బాబు సంపద సృష్టిస్తానంటూ ఊదరగొట్టారని, ఆయన సృష్టించిన సంపదను ప్రజలకు తెలియజేయాలన్నారు. సమావేశంలో ప్రజాప్రతినిధులు, నాయకులు వంగపండు అప్పలనాయుడు, గిరి రఘు, సింగారపు ఈశ్వరరావు, మద్దిల గోవింద, తదితరులు పాల్గొన్నారు.

1వ తేదీన పింఛన్ల పంపిణీ



కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

పార్వతీపురం: ఎన్‌టీఆర్ భరోసా పింఛన్లు ఆగస్టు 1వ తేదీనే పంపిణీ చేస్తున్నట్లు కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ మంగళవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆగస్టు 1వ తేదీ ఉదయాన్నే ఇంటింటికి పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు చేశామని, ఈ మేరకు అధికారులు, సిబ్బందికి సూచనలు జారీ చేశామని ప్రధాన కార్యదర్శికి కలెక్టర్ చెప్పారు. జిల్లాలో లక్షా 43,398 పింఛన్లు ఉన్నాయని, వాటికి రూ. 59.58కోట్లు పంపిణీ చేయనున్నామని తెలిపారు. కదలలేనివారికి మొదటిగా పింఛన్ పంపిణీ చేయనున్నామన్నారు. సచివాలయ సిబ్బంది, ఏపీఎంలు, సీసీలు తదితరులను భాగస్వామ్యం చేస్తున్నామని వివరించారు. జిల్లా అధికారులను మండల ప్రత్యేకాధికారులుగా నియమించామని, మొదటి రోజునే శత శాతం పింఛన్ల పంపిణీకి చర్యలు చేపడుతున్నామని, అనివార్య కారణాల వల్ల ఎవరైనా మిగిలిపోతే రెండవ రోజు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

పర్యవేక్షణ చేయాలి
పింఛన్ల పంపిణీని ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ జిల్లా అధికారులను వెబ్ కాన్ఫరెన్స్‌లో మంగళవారం ఆదేశించారు. బ్యాంకుల నుంచి నగదు తీసుకుని సిద్ధం చేయాలని గ్రామాల వారీగా సిబ్బంది మ్యాపింగ్ పూర్తి చేయాలని, ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ వై.సత్యంనాయుడు, డ్వామా పీడీ కె.రామచంద్రరావు తదితరులు పాల్గన్నారు.

మెనూ ప్రకారం భోజనం పెట్టరా?

- గురుకుల కళాశాల తీరుపై విద్యార్థుల తల్లిదండ్రుల ఆవేదన



గురుకుల కళాశాల ప్రిన్సిపాల్‌తో మాట్లాడుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు

కురుపాం: విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని లేకుంటే ఐటీడీఏ పీఓకు సమస్యను వివరిస్తామని గురుకుల కళాశాల విద్యార్థుల తల్లిదండ్రుల ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం కురుపాం మండల కేంద్రంలోని శివ్వన్నపేట గురుకుల కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు మెనూ సక్రమంగా అమలు కావడం లేదని తెలియడంతో తల్లిదండ్రులంతా కళాశాలకు వెళ్లి ప్రిన్సిపాల్‌కు సమస్యను తెలియజేశారు. 570 మంది విద్యార్థులు ఉంటే 35 కేజీల బిర్యానీ ఎలా సరిపోతుందని, చాలీచాలనట్లు భోజనం పెట్టడంతో తమ పిల్లలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని, మెనూ ప్రకారం పెట్టకపోవడం సరికాదని ప్రిన్సిపాల్ సత్యవతిపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పిల్లల కడుపు కొట్టడం సరికాదని తీరు మారకుంటే ఐటీడీఏ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తామని హెచ్చరించారు. అలాగే పాఠశాల ఆవరణ, పరిసరాల్లో రాత్రి 11 గంటల సమయంలో అపరిచిత వ్యక్తుల సంచరిస్తున్నారని ప్రిన్సిపాల్ పట్టించుకోవడం లేదన, ఉన్నతాధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

టోల్ ప్లాజాను ఎత్తేయాలి

- జొన్నాడ టోల్‌ప్లాజా వద్ద పౌరవేదిక, ప్రజాసంఘాల ధర్నా
- మద్దతు తెలిపిన ఎమ్మెల్సీలు రఘువర్మ, సురేష్‌బాబు, ఎమ్మెల్యే అదితి



టోల్‌ప్లాజాను ఎత్తివేయాలని కోరుతూ మహాధర్నాలో పాల్గొన్న పౌరసంఘాల నాయకులు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు

డెంకాడ: విజయనగరం-విశాఖపట్నం రహదారిపై జొన్నాడ వద్ద ఏర్పాటుచేసిన టోల్‌ప్లాజాను తక్షణమే ఎత్తేయాలని కోరుతూ జిల్లా పౌర వేదిక ఆధ్వర్యంలో మంగళవారం మహాధర్నా నిర్వహించారు. దీనికి మద్దతు తెలుపుతూ ఎమ్మెల్సీలు పాకలపాటి రఘువర్మ, పెనుమత్స సురేష్‌బాబు, విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా పౌర వేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి మాట్లాడుతూ పార్టీలు, రాజకీయాలకు అతీతంగా జిల్లా పౌరవేదిక టోల్ ప్లాజాకు వ్యతిరేకంగా పోరాటం చేస్తోందన్నారు. ఎమ్మెల్యే అదితి గజపతిరాజు మాట్లాడుతూ తొలినుంచి టోల్ ప్లాజాను టీడీపీ వ్యతిరేకిస్తోందన్నారు. మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు ఇప్పటికే కేంద్ర ప్రభుత్వానికి లేఖరాసారన్నారు. ఎమ్మెల్సీలు రఘువర్మ, సురేష్‌బాబు మాట్లాడుతూ టోల్ ప్లాజాను రద్దు చేయాలని రెండు జిల్లాల ప్రజలు కోరుకుంటున్నారన్నారు. ప్రజల ఆవేదనను పాలకులు అర్థం చేసుకుని వెంటనే టోల్ ప్లాజాను ఎత్తేయాలని, లేకుంటే ప్రజాఉద్యమంగా మారుతుందన్నారు.

క్లుప్తంగా

అంధుల ఆశ్రమ పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం అర్బన్: స్థానిక పూల్‌బాగ్ కాలనీలో ప్రభుత్వ అంధుల ఆశ్రమ పాఠశాలలో 2024–25 విద్యా సంవత్సరంలో 1 నుంచి 8వ తరగతి వరకు ప్రవేశాల కోసం అంధబాలబాలికల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.మహేశ్వరరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 6 నుంచి 14 సంవత్సరాలలోపు వయస్సు ఉండి, 40 శాతం అంధత్వం గల బాలబాలికలు పాఠశాలలో ప్రవేశానికి అర్హులని పేర్కొన్నారు. సదరం వైద్య ధ్రువీకరణ పత్రాలను సమర్పించి ప్రవేశం పొందవచ్చన్నారు. ప్రవేశం పొందిన వారికి ప్రభుత్వం ఉచిత వసతి, పౌష్టికాహారం, ఆధునిక బ్రెయిలీ సామగ్రితో విద్య, కంప్యూటర్ శిక్షణ ఇస్తుందన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర, తల్లికి వందనం, మనబడి మన భవిష్యత్తు తదితర ప్రభుత్వ పథకాలు కూడా వర్తిస్తాయని తెలిపారు. పాఠశాలలో మొత్తం 31 ఖాళీలు ఉన్నాయని, పూర్తి వివరాల కోసం సెల్: 83175 48039, 79895 92141 నంబర్లను సంప్రదించాలని కోరారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో ఉపాధ్యాయులు

బొబ్బిలిరూరల్: మండలంలోని పారాది గ్రామ జెడ్పీహెచ్ పాఠశాల ఆవరణలో రాష్ట్రస్థాయి జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలకు క్రీడాకారుల ఎంపికను నిర్వహించారు. మంగళవారం జరిగిన ఈ ఎంపికలో పీడీలు బంగారునాయుడు, వెంకటనాయుడు, సత్యనారాయణల ఆధ్వర్యంలో క్రీడాకారుల ఎంపిక జరగ్గా ఎంపికైన క్రీడాకారులు ఆగస్టు నెల 17,18,19 తేదీల్లో శ్రీకాకుళంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా ఎంపికైన క్రీడాకారులకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగేశ్వర్రావు అభినందనలు తెలిపారు. ఈ పోటీల్లో మంచి ప్రతిభ కనబర్చి విజయం అందుకోవాలని ఆకాంక్షించారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తికి గాయాలు



రైలు నుంచి జారిపడిన రాంప్రసాద్

పార్వతీపురం టౌన్: ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు రైలు నుంచి జారిపడి తీవ్ర గాయాలపాలయ్యాడు. పార్వతీపురం రైల్వేస్టేషన్ సమీపంలో మంగళవారం జరిగిన ఈ సంఘటనపై జీఆర్‌పీ అవుట్ పోస్టు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పార్వతీపురం పట్టణంలోని రెడ్డివీధికి చెంది కాసిన రాంప్రసాద్ ప్రింటింగ్ ప్రెస్ నడుపుతున్నాడు. ప్రెస్‌కు సంబంధించి పేపర్లు అవసరమై రాజమండ్రి వెళ్లేందుకు పార్వతీపురం స్టేషన్‌లో భవానిపట్నం ట్రైన్ ఎక్కి ప్రమాదశాత్తు జారిపడ్డాడు. ప్రమాదంలో తీవ్రగాయాలు కాగా చికిత్సకోసం విశాఖలోని ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

ఆటో బోల్తా పడి ఒకరి మృతి

- ముగ్గురికి గాయాలు



రోడ్డుపై ఉన్న క్షతగాత్రులు

సీతానగరం: రాష్ట్రీయ రహదారిపై సీతానగరం మండలంలోని అంటిపేట–లచ్చయ్యపేట గ్రామాల మధ్య మంగళవారం మధ్యాహ్నం అదుపు తప్పి ఆటో బోల్తా పడడంతో ఒకరు మృతి చెందగా మరో ముగ్గురు గాయాల పాలయ్యారు. ఈ ప్రమాదంపై స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి మండలంలోని లచ్చయ్యపేట గ్రామానికి చెందిన డ్రైవర్ సీహెచ్ చిన్నారావు ఆటోలో అదే గ్రామానికి చెందిన ఆర్.దావీదు, సీహెచ్ శంకరరావు, అరసాడ పైడిరాజు, సీహెచ్ ప్రసాద్ అంటిపేట నుంచి లచ్చయ్యపేట వెళ్లేందుకు ఎక్కారు. అంటిపేట సమీపంలో బియ్యం గొడౌన్ ఎదురుగా రోడ్డుపై ఆటో అదుపు తప్పి బోల్తాపడి పొలాల్లో పడిపోవడంతో జరిగిన ప్రమాదంలో అందరూ గాయాలపాలయ్యారు. గమనించిన స్థానికులు సమీపంలో ఉన్న బొబ్బిలి ప్రభుత్వాస్పత్రికి క్షతగాత్రులను తరలించారు. క్షతగాత్రుల్లో పైడిరాజు(23) పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో విజయనగరం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹102	₹174	₹184

ఎదురుచూపు ఇంకెన్నాళ్లు..!

- ఆవేదన వ్యక్తం చేస్తున్న మైదాన ప్రాంత గిరిజనులు
- ఐటీడీఏ పరిధిలో చేర్చాలని విన్నపం
- పథకాలకు దూరంగా నాన్ షెడ్యూల్ గిరిజన గ్రామాలు
- పోరాడినా స్పందించని గత ప్రభుత్వాలు
- ఉద్యోగాలు, అభివృద్ధికి నోచుకోని గిరిజనులు



మండలంలోని జోగిందొరవలస గిరిజన గ్రామం



అధ్వానంగా ఉన్న జీలికవలస రహదారి

రామభద్రపురం: దశాబ్దాలుగా ఎన్నో ప్రభుత్వాలు మారుతున్నాయి. పాలకులూ మారుతున్నారు. కానీ బొబ్బిలి నియోజకవర్గంలోని తమ గ్రామాల బతుకులు మారడం లేదని పలువురు గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంలోని నాన్ షెడ్యూల్ గ్రామాలకు చెందిన గిరిజనులు సబ్‌ప్లాన్ పరిధిలో లేకపోవడంతో ఐటీడీఏ ద్వారా ప్రభుత్వం అందజేస్తున్న గిరిజన సబ్‌ప్లాన్ సంక్షేమ పథకాలకు దూరంగా ఉంటున్నారు. పార్వతీపురం ఐటీడీఏ గిరిజన సబ్‌ప్లాన్ పరిధిలోకి నాన్ షెడ్యూల్ పరిధిలో ఉన్న ఇక్కడి గిరిజన గ్రామాలను కలపాలని గతంలో మంత్రులు, కలెక్టర్, ఐటీడీఏ పీవో, ఉన్నతాధికారులకు పలుమార్లు మొరపెట్టుకున్నప్పటికీ ఫలితం లేకపోయిందని గిరిజన యువకులు, ప్రజలు వాపోతున్నారు. ప్రభుత్వం ఐటీడీఏ పరిధిలోని షెడ్యూల్ గిరిజన గ్రామాలకు చెందిన గిరిజన యువకులకు ప్రాధాన్యం ఇస్తూ పూర్తి స్థాయిలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు అక్కడి గ్రామాల అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తోంది. ఇక్కడి షెడ్యూల్ కులాలకు మొండిచెయ్యి చూపిస్తుండడంతో నియోజక వర్గానికి చెందిన గిరిజనులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బొబ్బిలి నియోజకవర్గంలోని రామభద్రపురం, బొబ్బిలి, బాడంగి, తెర్లాం మండలాల్లో సుమారు 55 గిరిజన గ్రామాలు ఉండగా వాటిలో దాదాపు 11 వేల మంది గిరిజనులు నివసిస్తున్నారు. ఈ గ్రామాలన్నీ మైదాన ప్రాంతాలలో ఉన్నాయన్న ఉద్దేశంతో ఐటీడీఏలో కలపకుండా వదిలేసినట్లు సమాచారం. దీంతో వారంతా ఐటీడీఏ సబ్‌ప్లాన్ ద్వారా అమలు చేస్తున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరంగా ఉండిపోవాల్సిన పరిస్థితి దాపురిస్తోంది. ఈ గిరిజన గ్రామాలలో కనీస మౌలిక వసతులు లేక కొండలలో మగ్గిపోవాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రహదారులు అధ్వానంగా ఉండడంతో అత్యవసర సమయాల్లో ఆస్పత్రులకు వెళ్లాలంటే నానా అవస్థలు పడాల్సివస్తోందని వాపోతున్నారు. పిల్లలు ఉన్నత చదువులకు కూడా దూరమవుతున్నారని, ఏన్నో ఇబ్బందులు పడి ఎక్కడో ఉన్నత చదువులు చదువుకుని వస్తే ఉద్యోగావకాశాలు లేక కొండలలో కర్రలు కొట్టుకుని జీవనం సాగించవలసి వస్తోందని ఆవేదన చెందుతున్నారు. నియోజకవర్గంలో నాన్‌షెడ్యూల్డ్‌గా ఉన్న గిరిజన గ్రామాలను ఐటీడీఏ పరిధిలో చేర్చేందుకు గత ప్రభుత్వాలు పెద్దగా చొరవ చూపకపోవడంతో పాటు కేంద్ర ప్రభుత్వం దృష్టికి ప్రతిపాదనలు తీసుకెళ్లడంలో విఫలమయ్యాయని ఆరోపిస్తున్నారు.దీంతో ఈ నాన్‌షెడ్యూల్డ్ గ్రామాల సమస్య అపరిష్కృతంగా ఉండిపోతోందని పలుగ్రామాల గిరిజన ప్రజలు ఆరోపిస్తున్నారు. కూటమి ప్రభుత్వంలోనైనా ఈ సారి జరగనున్న ఐటీడీఏ పాలకవర్గంలో నాన్ షెడ్యూల్ గిరిజన గ్రామాల సమస్యలపై చర్చించి సబ్‌ప్లాన్ పరిధిలోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఇక్కడి వారు గిరిజనులు కారట..



నేను ఎంఏ బీఈడీ చదివాను.గిరిజన సంక్షేమ పాఠశాలల్లో కాంట్రాక్ట్ ఉపాధ్యాయ పోస్టు కోసం వెళ్లాను. మీరు ఐటీడీఏ సబ్‌ప్లాన్ పరిధిలో లేరు. అందులో ఉన్నవారికే ఈ పోస్టులు ఇస్తాం. ఐటీడీఏ పరిధిలో ఉన్నట్లు కుల ధ్రువీకరణ పత్రం తేవాలని అధికారులు అన్నారు. కానీ ఉద్యోగం ఇవ్వలేదు. ఎంత చదువు చదివినా ప్రయోజనం లేకుండా పోయింది. దీంతో మా తల్లిదండ్రులతో కలిసి కట్టెలు కొట్టుకుని జీవనం సాగిస్తున్నాను. **కత్తుల రవి, జుమ్మువలస, రామభద్రపురం మండలం**

ఎన్నో సార్లు వినతులు ఇచ్చినా కానరాని ఫలితం



మా గ్రామాలు నాన్ షెడ్యూల్ పరిధిలో ఉండడంతో అనేక సంక్షేమ పథకాలకు దూరమవుతున్నాం. పిల్లలు కూడా పెద్ద చదువులు చదివి ఉద్యోగాలు లేక కట్టెలు కొట్టుకుంటూ జీవనం సాగిస్తున్నారు.మా గ్రామాలను ఐటీడీఏ పరిధిలో చేర్చాలని అనేక మార్లు వినతులు ఇచ్చినప్పటికీ ప్రయోజనం లేకపోయింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఐటీడీఏ పరిధిలో చేర్చాలని కోరుతున్నాం. **సోముల కుమారి, సర్పంచ్, రావివలస, రామభద్రపురం మండలం**

పార్టీలకతీతంగా ఆదివాసీ దినోత్సవం

- పాలకొండ ఎమ్మెల్యే జయకృష్ణ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయకృష్ణ, పక్కన ఐటీడీఏ పీవో రాహుల్‌కుమార్‌రెడ్డి

సీతంపేట: పార్టీలకతీతంగా అందరం కలిసి వచ్చే నెల 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహిద్దామని పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయన స్థానిక ఐటీడీఏలోని ఎస్‌ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో ప్రాజెక్టుఅధికారి టి.రాహుల్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో వివిధ గిరిజన సంఘాల నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి అభిప్రాయాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా ఆదివాసీ దినోత్సవం నిర్వహించాలని పిలుపునిచ్చారు. ట్రైబల్ టీచర్స్ ఎక్కువ మంది ఆదివాసీ దినోత్సవానికి హాజరు కానున్నందున ఆ రోజు పాఠశాలలకు సెలవు ఇవ్వగలిగితే మంచిదని అభిప్రాయ పడ్డారు. గిరిజన భవన్ నిర్మాణానికి స్థలపరిశీలన చేయాలని ఐటీడీఏ పీఓను కోరారు. అనంతరం పీవో రాహుల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ సంఘాలు చెప్పిన విషయాలన్నీ పరిగణనలోకి తీసుకుని పరిశీలిస్తామని చెప్పారు. గిరిజనులు సీతంపేటకు తీసుకురావడానికి ట్రాన్స్‌పోర్ట్, భోజనసౌకర్యాలు కల్పించనున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఏపీవో గణేష్, టీడీపీ నియోజకవర్గం ఇన్‌చార్జి పి.భూదేవి, గిరిజన సంఘాల నాయకులు బి.తేజేశ్వరరావు, కె.సుబ్బారావు, బి.ఉమామహేశ్వరరావు, బి.లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ దినోత్సవ ఏర్పాట్లు పూర్తి చేయాలి

పార్వతీపురం టౌన్: ఆగస్టు 9వ తేదీన నిర్వహించనున్న ఆదివాసీ దినోత్సవ ఏర్పాట్లను పూర్తిచేయాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఎస్.సేతు మాధవన్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఐటీడీఏ కార్యాలయంలో ఆదివాసీ దినోత్సవ ఏర్పాట్లపై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆదివాసీ దినోత్సవాన్ని ఆగస్టు 9న నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఆదేశాల మేరకు ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం వేదికగా ఆదివాసీ దినోత్సవం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దంపట్టే విధంగా వేడుకలు ఉండాలని స్పష్టం చేశారు. ఆదివాసీ దినోత్సవం ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. స్థానిక కళాకృతులు, నృత్యాలు, వంటకాలు, పంటల ప్రదర్శన ఏర్పాటు చేయాలని సూచించారు. వివిధ శాఖలు ప్రదర్శన శాలలు ఏర్పాటు చేయాలని, తాగునీరు, పారిశుధ్యం నిర్వహణను సంబంధిత అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి అవసరమైన మందులు సిద్ధం చేయాలన్నారు. నిరంతర విద్యుత్ సరఫరాకు చర్యలు చేపట్టాలని, ఆదివాసీ దినోత్సవం నిర్వహణకు ఏర్పాటు చేసిన కమిటీలు వారికి అప్పగించిన పనులను సకాలంలో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. సమావేశంలో ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి ఎ.మురళీధర్, ఏఏఓ ప్రసాద్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కె విజయ పార్వతి, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ వై.సత్యం నాయుడు, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె. రామచంద్ర రావు, జిల్లా గ్రామ పంచాయతీ అధికారి బలివాడ సత్యనారాయణ, గిరిజన సంక్షేమ శాఖ ఇంజినీరింగ్ అధికారి జె.శాంతీశ్వర రావు పాల్గొన్నారు.

సెంటర్ లైటింగ్‌ను ఢీకొట్టి యువకుడి దుర్మరణం



మృతుడు సాయి గణేష్ (ఫైల్)

నెల్లిమర్ల రూరల్: విశాఖ జిల్లా భీమిలి ప్రభుత్వాస్పత్రి సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నెల్లిమర్ల మండలానికి చెందిన యువకుడు మృతి చెందాడు. ఈ ఘటనపై కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తంగుడుబిల్లి గ్రామానికి చెందిన వార్డు మెంబర్ వాల్లే నాగేశ్వరరావు, కొన్నేళ్లుగా నెల్లిమర్ల పట్టణంలో నివాసం ఉంటున్నారు. ఆయన పెద్ద కుమారుడు సాయిగణేష్(22) చింతలవలస ఎంవీజీఆర్ కళాశాలలో బీటెక్ చదువుతున్నాడు. మంగళవారం కళాశాలకు వెళ్లిన సాయి గణేష్, మరో స్నేహితుడితో కలిసి ద్విచక్రవాహనంపై భీమిలి బీచ్ కు వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో భీమిలి ప్రభుత్వాస్పత్రి సమీపంలో ద్విచక్రవాహనం అదుపు తప్పి డివైడర్‌కు ఉన్న సెంటర్ లైటింగ్ స్తంభాన్ని ఢీకొట్టడంతో ఇనుప చువ్వ తలకు గుచ్చుకుని అక్కడికక్కడే మృతి చెందాడు. వెనుక కూర్చున్న మరో యువకుడికి గాయాలయ్యాయి. సాయిగణేష్ మృతితో తల్లిదండ్రులు తీవ్రంగా రోదించారు. మృతుడి స్వగ్రామం తంగుడుబిల్లిలో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి.

కేంద్ర బడ్జెట్‌లో జిల్లాకు అన్యాయం

- సీపీఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు
- జిల్లా కేంద్రంలో నిరసన ర్యాలీ



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

పార్వతీపురం టౌన్: మాటలు ఘనం..నిధులు శూన్యంగా ప్రకటించిన కేంద్ర బడ్జెట్‌ను సీపీఎం పార్వతీపురం మన్యం జిల్లా కమిటీ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు అన్నారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ నిరసిస్తూ మంగళవారం పార్వతీపురం పట్టణంలోని బెలగాం కూడలి వద్ద సీపీఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలపై భారం వేసిన బడ్జెట్‌ను తీవ్రంగా ఖండించాలని పిలుపునిచ్చారు. పార్వతీపురం మన్యం జిల్లాలో జంఝావతి, తోటపల్లి, గుమ్మిడి గడ్డ, పెద్దగడ్డ తదితర నీటి ప్రాజెక్టులకు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని, ల్యాండ్ టైటిలింగ్ యాక్టర్ రద్దును అనుసరించి మన్యం జిల్లాలో కబ్జా, ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూములపై ప్రత్యేక దర్యాప్తు జరిపి, దళితులు, గిరిజనులు, పేద బీసీలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రజల ఆశలకనుగుణంగా బడ్జెట్ లేదు. బడ్జెట్‌లో గ్రాంట్ కింద నిధులు వచ్చేలా కేంద్ర ప్రభుత్వంపై రాష్ట్ర ఎంపీలు ఒత్తిడి చేయాలని కోరారు. అభ్యుదయ వాదులు మేధావులు రాష్ట్ర అభివృద్ధికి నిధుల సాధనకు డిమాండ్ చేయాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ ఆంధ్రప్రదేశ్ ప్రజలకు తీవ్ర నిరాశ కలిగించిందని, ఎన్నికలనంతరం ఆంధ్రప్రదేశ్‌కు న్యాయం జరుగుతుందని, భారీగా నిధులు వస్తాయని, విభజన చట్టంలోని అన్ని అంశాలు అమలుకు నిధులు కేటాయిస్తారని ఆశించిన ప్రజలకు నిరాశే ఎదురైందని అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఎం మన్యం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.మన్మథరావు, కె. అవినాష్ కుమార్, వి.ఇందిర, ఎం.శ్రీను, జిల్లా కమిటీ సభ్యులు రెడ్డి శ్రీదేవి, గొర్లి వెంకటరమణ, సభ్యులు వి. చిన్నంనాయుడు, పి.రాజశేఖర్ పాల్గొన్నారు.

హిట్ అండ్ రన్ బాధితులకు పరిహారం

- జిల్లా రెవెన్యూ అధికారి కేశవనాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌ఓ కేశవనాయుడు

పార్వతీపురం: హిట్ అండ్ రన్ (గుర్తు తెలియని వాహనాలు ఢీకొన్న) కేసుల్లో బాధితులకు పరిహారం అందించనున్నట్లు పార్వతీపురం మన్యం జిల్లా రెవెన్యూ అధికారి జె. కేశవనాయుడు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో రెవెన్యూ, పోలీసు అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు హిట్ అండ్ రన్ కేసులలో మరణించిన వారి కుటుంబీకులకు రూ. 2 లక్షలు, తీవ్రంగా గాయపడిన వారికి రూ.50వేలు పరిహారం అందించనున్నట్లు తెలిపారు. తరువాత వాహనం గుర్తించినట్లయితే ఇన్సూరెన్స్ కూడా క్లెయిమ్ చేసుకోవచ్చునని, చాలామంది బాధితులు ఇన్సూరెన్స్ క్లెయిమ్ చేసేందుకు వీలుపడదనే ఉద్దేశంతో హిట్ అండ్ రన్ కేసులలో కేంద్రప్రభుత్వం అందించే పరిహారం క్లెయిమ్ చేసేందుకు బాధితులు ముందుకురావడం లేదన్నారు. న్యాయ సేవాధికార సంస్థ బాధితులకు అవగాహన కల్పించి పరిహారం అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించిందని తెలిపారు. జిల్లాలో నమోదైన 13 హిట్ అండ్ రన్ కేసులలో బాధితులను ఆగస్టు 2 తేదీన సాయంత్రం 5 గంటలకు కలెక్టరేట్‌కు తీసుకురావాలని, వారికి అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఎవరైనా హిట్ అండ్ రన్ కేసుల బాధితులుంటే శుక్రవారం సాయంత్రం 5 గంటలకు కలెక్టర్ కార్యాలయానికి రావాలని లేదా సంబంధిత పోలీసు స్టేషన్ అధికారులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ డివిజినల్ అధికారి కె.హేమలత, సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌లు కృష్ణారావు, పి. సత్యనారాయణ, ఎస్సై కేపీ మూర్తి పాల్గొన్నారు.

గిరిజనులకు అందుబాటులో ఎస్టీ కమిషన్

- చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు



మాట్లాడుతున్న ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీశంకరరావు

విజయనగరం అర్బన్: సామాన్య గిరిజనులకు ఎస్టీ కమిషన్‌ను అందుబాటులోకి తీసుకురావాలన్న ఉద్దేశంతో రాష్ట్రవ్యాప్తంగా గిరిజన ప్రాంతాల్లో క్షేత్ర పర్యటనలు చేపట్టానని ఎస్టీ కమిషన్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ డీవీజీశంకరరావు అన్నారు. ఆయన బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా మంగళవారం పలు అంశాల గురించి తెలియజేశారు. గిరిజనుల సమస్యలను స్వేచ్ఛగా చెప్పుకునేందుకు వీలుగా వాట్సాప్ ద్వారా కూడా వారి దరఖాస్తులు స్వీకరించామన్నారు. ఐటీడీఏ ప్రాంతాల్లో సమీక్షలు నిర్వహించి అధికారుల సమక్షంలో గిరిజనుల సమస్యలను పరిష్కారం జరిగేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. అనంతగిరి ప్రాంతంలోని చిట్టింపాడు, గిరిశిఖర గ్రామాల్లో బాలింత మరణం జరిగినపుడు 7 కిలోమీటర్లు ద్విచక్రవాహనంపై, ఆపై కాలి నడకతో వెళ్లి వారి సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి రోడ్డు, మౌలిక సదుపాయాలు మంజూరు చేయడంలో కృషిచేశామని పేర్కొన్నారు. భాషా వలంటీర్లు కొనసాగేలా చేసిన కృషికి ప్రభుత్వం స్పందించిందని, అటవీ హక్కుల చట్టం, అత్యాచార నిరోధక చట్టంపై వివిధ ప్రాంతాల్లో అవగాహన సదస్సులు నిర్వహించామని వివరించారు.

కబేళా కేసులో ముగ్గురి అరెస్ట్

విజయనగరం క్రైమ్: కొత్తపేట వద్ద నిర్వహిస్తున్న కబేళాకు సంబంధించిన కేసులో ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు టూటౌన్ సీఐ కోరాడ రామారావు మంగళవారం తెలిపారు. అదుపులోకి తీసుకున్న వారిలో కబేళా నిర్వహిస్తున్న మహమ్మద్ ఫయాజ్, అలీమ్, మహమ్మద్ యూసఫ్‌లు ఉన్నట్లు చెప్పారు.

తోటపల్లి కాలువ ఆక్రమణ ఫిర్యాదుపై సర్వే



సర్వే చేస్తున్న ఇంజనీరింగ్, రెవెన్యూ అధికారులు

పూసపాటిరేగ: మండలంలోని నక్కానపేట సమీపంలో తోటపల్లి కాలువ కోసం సేకరించిన భూమిలో ఏకే డెవలపర్స్ ఆక్రమించిందని అందిన ఫిర్యాదుపై తోటపల్లి కాలువ ఇంజినీరింగ్, రెవెన్యూ అధికారులు మంగళవారం సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా తోటపల్లి కాలువ తవ్విన ప్రదేశాన్ని పరిశీలించారు. లేఅవుట్‌లో కాలువ తవ్విన ఆనవాళ్లు కనపడకపోవడంతో మళ్లీ పూర్తిస్థాయిలో తోటపల్లి కాలువకు సంబంధించిన రికార్డులతో పరిశీలించాలని నిర్ణయించారు. తోటపల్లి కాలువసమీపంలో ఓ ఇంటి నిర్మాణంలో చిన్న భాగం కలిసినట్లు గుర్తించారు. సర్వేలో మండల సర్వేయర్ గణపతిరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మాదురి, తోటపల్లి కాలువ ఇంజినీర్లు కేఎస్‌ఎం సుబ్బారావు, డి.అపర్ణ, కె.దేవి తదితరులు పాల్గొన్నారు. దీనిపై తహసీల్దార్ తాడ్డి గోవింద వద్ద ప్రస్తావించగా తోటపల్లి కాలువలో ఆక్రమణ చేశారనే ఫిర్యాదుపై సర్వే నిర్వహించామని తెలిపారు.

ఏడుగురు గంజాయి నిందితుల అరెస్ట్

- 10.825 కిలోల గంజాయి స్వాధీనం
- ఒక మోటార్ సైకిల్, మూడు సెల్‌ఫోన్‌లు సీజ్



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ వకుల్ జిందల్ (వెనుక ముసుగులో నిందితులు)

విజయనగరం క్రైమ్: గంజాయి అక్రమ రవాణాకు పాల్పడుతున్న, వినియోగిస్తున్న ఏడుగురు నిందితులను అరెస్టు చేయడంతో పాటు వారికి సహకరిస్తున్న ఒక జువైనల్‌ను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్పీ వకుల్ జిందాల్ పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఎస్పీ వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి. రాజాం పట్టణంలో ముగ్గురు వ్యక్తులు గంజాయిని ఒడిశా రాష్ట్రంలోని కోరాపుట్‌లో కొనుగోలు చేసి, రాజాం నుంచి చిలకపాలెం వైపు అక్రమంగా రవాణా చేస్తూ అంతకాపల్లి గ్రామ జంక్షన్ వద్ద రాజాం పోలీసులకు పట్టుబడ్డారు. పట్టుబడిన ముగ్గురిలో గంజాయిని కోరాపుట్ నుంచి రాజాం వరకు బైక్‌పై తీసుకుని వచ్చిన కోరాపుట్ జిల్లా పొట్టంగి బ్లాక్ ములిగూడ గ్రామానికి చెందిన సలపు పంగి, శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్లకు చెందిన బొద్దాన సామిత్, జరజాం గ్రామానికి చెందిన ముద్దాడ వెంకటేష్‌లు ఉన్నారు. వారి నుంచి రూ. 2 లక్షల విలువైన 10 కిలోల 825 గ్రాముల గంజాయి, ఒక పల్సర్ బైక్, మూడు సెల్‌ఫోన్‌లను రాజాం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఆ ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకుని విచారణ చేయగా వారందించిన సమాచారంతో రాజాం పట్టణానికి చెందిన కసిన శ్రీధర్ (ఎ4), చిప్పాడ అరుణ్‌కుమార్ (ఎ5), జక్కం దీపక్ (6), రేగిడి ఆముదాల వలసకు చెందిన దంగల మణికంఠతో పాటు వారికి సహకరిస్తున్న మరో జువైనల్‌ను అదుపులోకి తీసుకున్నారు. నిందితులు సలపు పంగి (ఎ1), బొద్దాన సామిత్ (ఎ2), జరజాం గ్రామానికి చెందిన ముద్దాడ వెంకటేష్ (ఎ3)లు ఒడిశా రాష్ట్రంలో గంజాయి కొనుగోలు చేసి, చిన్న చిన్న పొట్లాలుగా చేసి గంజాయి అలవాటు ఉన్న వారికి విక్రయిస్తుంటారు. అదేవిధంగా మిగతా నిందితులతో పాటు జువైనల్‌కు గంజాయి పీల్చే అలవాటుగా ఉన్నట్లు గుర్తించి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

గంజాయి నియంత్రణకు ప్రత్యేక టీమ్

గంజాయి కలిగి ఉన్నా, వినియోగించినా, రవాణాకు పాల్పడినా చట్టపరమైన చర్యలుతప్పవని, వారిపై ఎన్‌డీపీఎస్ చట్టం ప్రకారం కేసులు నమోదుచేస్తామని ఎస్పీ వకుల్ జిందాల్ హెచ్చరించారు. గంజాయి నియంత్రణలో భాగంగా ఇప్పటికే ప్రత్యేకంగా బృందాన్ని ఏర్పాటుచేశామని, ఈ టీమ్ గంజాయి అక్రమ రవాణా, విక్రయించే వారి, వినియోగించే వారి సమాచారాన్ని సేకరించి, వారిని అదుపులోకి తీసుకుని, సంబంధిత పోలీసులకు అప్పగిస్తారని చెప్పారు. గంజాయి అక్రమ రవాణా నియంత్రణలో భాగంగా ఇతర రాష్ట్రాల నుంచి జిల్లాలో ప్రవేశించేందుకు ఆస్కారం ఉన్న 15 ప్రాంతాలను గుర్తించి, ఆయా ప్రదేశాల్లో ఆకస్మికంగా డైనమిక్ వాహన తనిఖీలు చేపడుతున్నామని ఎస్పీ స్పష్టం చేశారు. గంజాయి, మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలను విద్యార్థులకు వివరించేందుకు త్వరలో కార్యాచరణ ప్రణాళిక రూపొందించి విద్యాసంస్థల్లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తామని ఎస్పీ వకుల్ జిందాల్ స్పష్టం చేశారు.



భామిని: పోలీసులు పట్టుకున్న గంజాయి ప్యాకెట్లు

గంజాయి కేసులో ఇద్దరు మహిళలు..

భామిని: మండలంలోని బత్తిలి అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద ఒడిశా నుంచి అక్రమంగా తరలిస్తున్న గంజాయిని పట్టుకున్న కేసులో పాలకొండ సీఐ చంద్రమౌళి, బత్తిలి ఎస్సై సీహెచ్.ప్రసాద్‌లు మంగళవారం వివరాలు వెల్లడించారు. ఒడిశా నుంచి వస్తున్న ప్రైవేట్ బస్సులో తరలిస్తున్న 11 కేజీల గంజాయిని సీజ్ చేసి, గంజాయి తరలిస్తున్న ఇద్దరు ఒడిశా మహిళలను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు. గంజాయి కేసులో అరెస్టు చేసిన ఇద్దరు మహిళలు ఒడిశాలోని పద్మాపూర్ సమితి, కెందుగూడకు చెందిన వారుగా గుర్తించినట్లు తెలిపారు. ప్రైవేట్ బస్సు ద్వారా గంజాయి రవాణాకు మూలకారకులైన వారి వివరాలు సేకరిస్తున్నట్లు చెప్పారు. గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరు మహిళలు ఒడిశా అంగన్వాడీ కార్యకర్త, సహాయకురాలుగా తెలుస్తోంది.